# ముష్టి పిల్ల

వారం రోజులు ప్రోజెక్ట్ ఏరియాలో మకాం వేసి, పని పూర్తి చేసికొని, ఆ ఆదివారం ఉదయం జమ్మూలో యిల్లు జేరిన నాకు, ముందు వరండాలో కూర్చుని నా శ్రీమతి నీలవేణితో కబుర్లు చెబ్తున్న శ్రీపతీ, అతని భార్య సుశీలా కనబడ్డారు. శ్రీపతి నా బాల్య స్నేహితుడు. రైల్వేస్‌లో జబల్‌పూర్‌లో పని చేస్తున్నాడు. ఆరేళ్ళ తర్వాత వాణ్ణి చూడ్డంతో నా ఆనందానికి హద్దులు లేవు. వైష్ణవదేవి దర్శనం చేసికొని, తిరుగు ప్రయాణంలో మా యింట్లో దిగారన్నమాట. ముందు పలకరింపులయిన తర్వాత, నేను లోపలికి పోయి. స్నానం చేసి, మడత బట్టలు కట్టుకొని, ఓ రగ్గు కప్పుకొని వరండాలోకి వచ్చాను. నీలవేణి అందరికీ వేడి వేడి యిడ్లీలూ, కాఫీలూ అందించింది. బ్రేక్ ఫాస్ట్ పూర్తయిన తర్వాత కబ్లురులోకి దిగాం. వైష్టవదేవి యాత్రా విశేషాలు చెబ్తూ దారి పొడుగునా కూర్చుని సతాయించిన  బిచ్చగాళ్ళ ప్రసక్తి తీసికొచ్చారు శ్రీపతి దంపతులు.

“నువ్వే పుణ్యక్షేత్రానికి వెళ్ళినా యింతే! పళ్ళెంలో వేసిన దక్షిణ పూజార్లకి దక్కుతుంది. దాన పేటికలో వేసిన డబ్బు  దేవస్థానానికి వెడ్తుంది. ఆ డబ్బెలా వినియోగింపబడ్తుందీ

అన్నది, ఆ గుడి వేలుపులకే తెలియాలి! ఇక గుడి దారిలో గుడ్డలు పరుచుకుని కూర్చునే బిచ్చగాళ్ళకి డబ్బులు పడేస్తే, అది ఓ చిన్న సైజు దానం! అయితే ఈ మూడింటిలో ఏది ఎక్కువ పుణ్యాన్నిస్తుందీ అన్న దానికి సమాధానం, గుడికి వెళ్ళే వ్యక్తుల మనస్తత్వాల మీద ఆధారపడి ఉంటుంది. ఇటువంటి ఆలోచనలకి ప్రతీ వ్యక్తీ అంతో యింతో గుడికి వెళ్ళినప్పుడల్లా గురవుతూనే ఉంటాడు. గొడవ ఎక్కడ వస్తుందంటే, కాసిని డబ్బులు బిచ్చగాళ్ళకి వేద్దామనుకొన్నా ఎవరికని వేసేది? ఎంత మందికని వేసేది? అదీకాక దానం చెయ్యడం సులువేమో కాని, దాని కర్హుడెవడో నిర్ణయించడం చాలా కష్టం!....."

నా ఉపన్యాస ధోరణికి నీలవేణి అడ్డువేసింది.

"చాలాకాలం తర్వాత తీరుబడిగా కూర్చుని. తెలుగు వారితోమాట్లాడే అవకాశం ఈ రోజు దొరికింది శ్రీవారికి! మీరు వింటూకూర్చుంటే, ఆ ప్రవాహానికి అడ్డుండదు. జాగ్రత్త!" అని నీలవేణి వాళ్ళని హెచ్చరించింది నవ్వుతూ.

"పది రూపాయల చిల్లరా పావు గంటలో అయిపోయింది. తీరా నిజమైన అపాంగులూ, వికలాంగులూ కంటబడేసరికి, అయిదు రూపాయల కాయితాలు తప్ప మరేమీ లేకపోవడంతో, కిమ్మనకుండా వాళ్ళ అరుపుల్ని పెడచెవిన పెట్టి, దాటుకుంటూ పోయాం. ఆ ముష్టివాళ్ళ దగ్గరే చిల్లర మార్చడానికి మనసొప్పలేదనుకో!"అన్నాడు శ్రీపతి.

"చూశావా మరి?! మరో పది రూపాయల చిల్లరుంటే, వాళ్ళకీ ఏదో ఇంత విదిలించే వాళ్ళం కాని, ఆ ఇరవై రూపాయలూ నిజంగా అపాంగులైనా ఏ ఒక్కరికో, ఇద్దరికో యివ్వడానికి మనస్కరించదు! అదీకాక...."

నేనింకా ఏదో అనబోయేంతలో, గేటు తలుపు తోసిన శబ్దం వినిపించి, అటు వైపు చూశాను. ఓ పదకొండు పన్నెండు సంవత్సరాల వయసులో ఉన్న పిల్ల ఆవరణ దాటి, వరండా మెట్టవరకూ వచ్చి, "ధర్మం చెయ్యండి బాబూ" అంటూ చేయి చాచి నిలబడింది.

" ఎక్కణ్ణుంచి దాపురించిందో కాని. నాలుగు రోజుల్నుంచీ ప్రాణాలు తోడేస్తోంది! పావలా డబ్బులు పడేస్తేనే కాని కదలట్లేదు!" అంటూ కుర్చీలోంచి లేవబోయిన శ్రీమతిని చూసి, కూర్చోమన్నట్టుగా సైగచేశాను.

అదే నేను చేసిన పొరపాటు.

చిన్న వయసులో ఉన్న ఆ పిల్ల చింపిరి జుట్టుతో, చిరిగిన బట్టలతో ఉంది. రంగు మాసిన స్వెట్టరు, గుండీలుండవలసిన చోట గుడ్డ పీలికలతో బిగించి కట్టుకొంది. చూడ్డానికి తగినవంత ఆరోగ్యంగా కనబడకపోయినా, ఆకలి బాధతో శుష్కించిన చిహ్నాలు మట్టుకు లేవు. ఆకర్షించుకొనే దీనత్వం మట్టుకు కళ్ళలో కనబడింది. ఒక్క క్షణం జాలి కలగకపోలేదు. అయినా కాస్త కర్కశంగా అన్నాను- "దుక్కలా ఉన్నావు, ముష్టెత్తుకోడానికి సిగ్గు లేదూ?"

చాచిన చెయ్యినలాగే ఉంచి, "ధర్మం చెయ్యి తల్లీ ఆకలేస్తోంది," అందా పిల్ల రెండో చేత్తో మొహం మీదపడ్డ జుత్తుని పక్కకు తోస్తూ.

నాలుగు రోజుల్నుంచీ డబ్బులు విదిలిస్తున్న శ్రీమతికి, నలుగురి మధ్యా ఉండడంవల్ల ధైర్యం వచ్చిందనుకొంటాను. "ఈ రోజు నీకు నయా పైసా కూడా యిచ్చేది లేదు, బయటకు పో!" అన్నది విసురుగా.

అయితే ఆ కసుర్లూ, విసుర్లూ ఆ పిల్ల మీద పని చేసినట్లు లేవు. అక్కడే నిల్చుని, అదే వరస-- "ధర్మం చెయ్యండయ్యా, దేముడు మీకు మేలు చేస్తాడు."

శ్రీమతి ఏదో అనబోయి, నన్ను చూసి ఆగింది.

"నువ్వింక అనవసరంగా మాట్లాడకు. ఆ పిల్ల సంగతి నేను చూస్తాను," అంటూ కుర్చీలోంచి లేచాను. కప్పుకొన్న రగ్గు జారిపోయింది. వేసుకున్న పల్చటి స్వెట్టర్లోంచి వెన్నుకొచ్చి తగిలింది డిసెంబర్ నెల చలిగాలి. చిరిగిన బట్టల్లో ఉన్న ఆ పిల్ల కెంత చలిగా ఉందో? మళ్లీ ఒక్క క్షణం అదే జాలి! అయినా మనసు కటువు చేసుకొని అన్నాను--"ఏదో పని చేసికొని బ్రతకాలి కాని, యిలా ముష్టెత్తుకు కాదు! సరే, రూపాయిస్తాను ఆ మొక్కలకి నీళ్ళు పొయ్యి. ఏమంటావు?"

"మీరేదో ఉద్ధరిస్తారూ అనుకొంటే, పావలాతో వదిలిపోయే దానికి రూపాయి తగలెడ్తున్నారు!"

శ్రీమతి మాటలకి శ్రీపతి దంపతులు చిన్నగా నవ్వారు. వాళ్ళ చిరునవ్వు నన్ను రెచ్చగొట్టింది.

"రూపాయి కాకపోతే, రెండు రూపాయలిస్తాను! ఆ మూలనున్న చీపురుతో నీళ్ళ పంపు చుట్టూ పడి వున్న ఆకుల్ని తుడిచి, వీధిలో ఉన్నచెత్త కుండీలో వెయ్యి. ఆ చిన్న ప్లాస్టిక్ బాల్చీలో నీళ్ళు నింపి మొక్కలికి పొయ్యి" అన్నాను.

"అమ్మా నీకు పుణ్యముంటుంది, ఓ పావలా దానం చెయ్యి!"

"ఏమైనా సరే ఈ రోజు నీకు ఊరికినే డబ్బులిచ్చేది లేదు! ఈ కాస్త పని చెయ్యడానికి పావుగంట కూడా పట్టదు. ఆలోచించుకో. లేకపోతే, నువ్వు రోజల్లా ఇక్కడ నిల్చున్నా, నయా పైసా కూడా దొరకదు. ఆ పైన నీయిష్టం" అంటూ కుర్చీలో కూర్చున్నాను.

ఓ రెండు నిముషాలు నిశ్శబ్దం అవరించింది. ఉన్నట్టుండి ఆ పిల్ల పంపు దగ్గరకు వెళ్ళి, చీపురు తీసికొని తుడవసాగింది. నేను విజయగర్వంతో చూశాను.

'ఇప్పుడే కదా కాఫీ త్రాగింది, ఇంకేమీ వద్ద'న్న వాళ్ళ మాటల్ని పట్టించుకోకుండా, టీ చేసి పట్టుకు రమ్మని శ్రీమతిని లోపలికి పంపాను. ఆ పిల్ల పనిచేస్తున్న తీరుని గమనించసాగాను. తుడవడంలో అనుభవం కనిపించలేదు. అయినా కష్టపడి ఆకుల్ని తుడిచి, బాల్చీలోకి ఎత్తి, బయట కుండీలో పోసి వచ్చింది. తర్వాత బాల్చీతో నీళ్ళు నింపి, మొక్కలికి పోసింది. నీళ్ళు పొయ్యడంలో పర్వాలేదనిపించింది.

పనిచేసి వరండా మెట్ల దగ్గరకు వచ్చి, కింద మెట్టు మీద కూర్చుని, అరచేతులు చూసుకుంటూ కూర్చుంది. నీలవేణి ఆ పిల్లక్కూడా ఓ పాత కప్పులో టీ యిస్తూ 'పేరేమి'

టని అడిగి 'దుర్గ' అని తెలుసుకుంది. దుర్గ కొంచెంగా సంకోచిస్తూనే, టీ కప్పు అందుకొంది. టీ త్రాగి, పంపు దగ్గరకు వెళ్ళి, కప్పుని కడిగి తీసుకొచ్చి వరండాపై మెట్టు మీద పెట్టి, మళ్ళీ కూర్చుంది. అదే, ఆ చిన్న సంస్కార చిహ్నం నిజానికి నాకు చాలా నచ్చింది.

"డబ్బులు తీసుకురా" అన్నాడు నీలవేణితో. లోపలికి వెళ్ళి ఓ రెండర్ధ రూపాయలూ, నాలుగు పావలలూ తీసికొచ్చి నా చేతిలో పోసింది. దుర్గని పైకి వరండాలోకి రమ్మన్నాను.

లేచి, నెమ్మదిగా నడుచుకొంటూ నా దగ్గరగా వచ్చి నిల్చుంది. దుర్గ చేతిలో డబ్బులు లెక్కించివేస్తూ, "చూశావా, నీకిప్పుడెంత సంతోషంగా ఉందో? కష్టించి పనిచేస్తే వచ్చే ప్రతిఫలం తృప్తి నిస్తుంది. గౌరవాన్నిస్తుంది" అన్నాడు.

"నేనిలా ప్రతిరోజూ వస్తే పనిప్పిస్తారా అయ్యగారూ?"

'ఓ' అనబోయి తమాయించుకొన్నాను. దుర్గ చేత పంతం కొద్దీ పని చేయించాలనే కాని, అవసరముండి కాదు. ఆరేళ్ళ నుంచీ పని మనిషి ఉండగా, వేరే పని పిల్ల అవసరం లేదు.

మా అందరికేసి దుర్గ తలాడిస్తూ చూసింది. చేతిలో ఉన్న నాలుగు పావలా కాసుల్ని బల్ల మీద పెట్టింది. మెట్లు దిగుతూ, పై మెట్టు మీదున్న కప్పులో రెండర్ధ రూపాయలూ పడవేసింది. ఆ తర్వాత వడివడిగా నడుచుకుంటూ గేటు తీసుకొని, బయటకు వెళ్ళిపోయింది!

మాకందరికి మతులు పోయాయి!

"ఆ పిల్ల చేసిన పని నీకర్థమైందా శ్రీపతీ?!" అన్నాను.

"పని చేస్తే రెండు రూపాయిలిస్తా నన్నావు. దుర్గ చేసింది. నువ్వు అన్నట్లుగా రెండు రూపాయిలిచ్చావు. దుర్గ బల్ల మీద నాలుగు పావలాలు వదిలి, నాలుగు రోజుల ముష్టికీ చెల్లు కొట్టింది. మిగిలిన రెండర్ధలతో ఇచ్చిన 'టీ' కి బిల్లు చెల్లించింది. నీ నీతి బోధ పని చేసిందనుకొంటాను, తన పౌరుషం చూపించి, అభిమానం కాపాడుకొంది!" అన్నాడు శ్రీపతి.

"కాదు శ్రీపతీ! 'శ్రమించి పని చెయ్యాలి కాని ముష్టెత్తుకోకూడదని చెప్పడం సులువు. కాని పని దొరికేటట్టు చెయ్యడం చాలా కష్టం. అయితే, చేతులు చాచి యాచన చేస్తే, దానాలు చేసే దాతలు దొరక్కపోరు! పనే దొరికితే, ముష్టెందుకెత్తుతాను?' అన్న విషయాన్ని దుర్గ నోరు విప్పకుండా ఋజువు చేసి మరీ వెళ్ళింది!" అన్నాను, ఓడిపోయిన మొహంతో.

"నేను ముందరేచెప్పాను! పావలాతో వదిలిపోయేదానికింత రాద్ధాంతం చేశారు!" అంది నీలవేణి సాగదీస్తూ.

నా మాటలకి, నీలవేణి మాటల కంటే వేరే తార్కాణం ఏం కావాలి? ●

('రచన' ఇంటింటి పత్రిక : నవంబరు 1997)